సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం ၊ 25 ၊ ఫిబ్రవరి ၊ 2023



దట్టంగా పొగమంచు

పొగమంచు దట్టంగా కురుస్తోంది. చలిగాలులు విజృంభిస్తున్నాయి. ఎగటి వేళల్లో భానుడు ప్రతాపం చూపుతున్నాడు. 8లో



తేనెపట్టులు కనువిందు

సాక్షి,పాడేరు: పట్టణంలో అటవీశాఖ పాత కార్యాలయం వద్ద తురాయి చెట్టుకు ఉన్న తేనె పట్టులు కనువిందు చేస్తున్నాయి.



మెరుగైన వైద్యం అందించండి

ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

28న మినీ జాబ్‌మేళా

అడ్డతీగల: రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఈనెల 28వ తేదీన మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థలోని శిక్షణ విభాగం సహకారంతో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. డైకిన్, హెల్ప్ ఎయిర్ నీడ్స్, మోహన్ స్పీ ఇంటెక్ సంస్థల్లో ఉద్యోగాలకు టెన్త్, ,ఇంటర్, డిగ్రీ, డిప్లమో విద్యార్హతలు గల అభ్యర్థులు అర్హులన్నారు. వేతనం రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఉంటుందన్నారు.18 నుంచి 30 ఏళ్లోపు వయసు కలిగిన స్త్రీ, పురుషులు అర్హులని ఆయన పేర్కొన్నారు. తిరుపతి వద్ద శ్రీ సిటీ, విజయవాడ ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 6304634447 నంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

కాఫీ క్షేత్రాల సందర్శన



మినుములూరులోని కేంద్ర కాఫీబోర్డు క్షేత్రం వద్ద విద్యార్థుల బృందం

సాక్షి,పాడేరు: కర్నాటక రాష్ట్రం గులబర్గ విశ్వ విద్యాలయానికి చెందిన ఎంఎస్సీ బోటనీ విద్యార్థుల బృందం మినుములూరులోని కేంద్ర కాఫీ బోర్డు క్షేత్రాలను శుక్రవారం సందర్శించింది. దీనిలో భాగంగా కాఫీ, మిరియాల తోటలను పరిశీలించారు. నాణ్యమైన కాఫీ గింజల ఉత్పత్తి, మార్కెటింగ్ తదితర అంశాలపై సమగ్ర వివరాలను ఎస్‌ఎల్‌వో విష్ణు వారికి తెలియజేశారు. రెండో రోజుల విజ్ఞానయాత్రలభాగంగా ఈ ప్రాంతంలో పర్యటించారు.

రక్తహీనత నివారణకు చర్యలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు

రంపచోడవరం: ఏజెన్సీలో వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి తగు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ అనూషను రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తహీనత నివారణకు సంబంధించి ముక్తి భారత్ ప్రోగ్రామ్‌లో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అందుకు అవసరమైన మందులను అందజేసే బాధ్యత సంబంధిత పీహెచ్‌సీ వైద్యాధికారులపై ఉందన్నారు. ఆశ్రమ పాఠశాలల్లోని బాలబాలికల్లో రక్తహీనత గుర్తిస్తే మెరుగైన పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వారికి తాజా ఆహార పదార్థాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆశ్రమాల్లో అనారోగ్యానికి గురైన విద్యార్థులను హెచ్‌ఎం, వార్డెన్లు వెంటనే సమీప ఆస్పత్రికి తీసుకువెళ్లి వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు లక్ష్యం పెంపు

రాజవొమ్మంగి: జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం మరో 1500 టన్నులు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ తెలిపారు. ఆయన ఫోన్లో మాట్లాడుతూ ధాన్యం నగదు మరో రూ.25.3 కోట్లు శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ అయిందన్నారు. ఇప్పటి వరకు రూ.54.37 కోట్ల విలువైన 26,700 టన్నులు ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన వివరించారు. ఇప్పటికే 5,288 మంది రైతులకు రూ. 50.05 కోట్లు చెల్లించినట్టు తెలిపారు. రైతుల వద్ద మిగిలిపోయిన ధాన్యాన్ని కూడా వెనువెంటనే కొనుగోలు చేసి ఒకటి రెండు రోజుల్లో లక్ష్యం పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

అరకులోయ రూరల్: హోటల్ మేనేజ్ మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాబ్ కో ఆర్డినేటర్ బొజ్జన్న తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హోటల్ మేనేజ్ మేంట్ కోర్సులకు ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్ అయిన అభ్యర్థులు అర్హులన్నారు. వయసు 19 సంవత్సరాల నుంచి 32 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. వీరు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపిక అనంతరం స్థానిక వైటీసీ కేంద్రంలో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు, హార్ట్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ అండ్ వెల్ఫేర్ సంస్థ డైరెక్టర్ మాణిక్యం సహకారంతో గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. పూర్తి వివరాలకు 9491070295, 86407656 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

400 గ్రామాలకు మోక్షం

- రూ.22.40 కోట్లతో 21 వంతెనల నిర్మాణం
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో పనులు



పెదబయలు మండలం గిన్నెలకోట రోడ్డులో గెడ్డపై నిర్మిస్తున్న వంతెన



జి.మాడుగుల మండలం కోడిమామిడి వంతెన నిర్మాణానికి ఏర్పాటుచేస్తున్న అప్రోచ్‌రోడ్డు

సాక్షి, పాడేరు: స్వాతంత్య్రం సిద్ధించిన నాటి నుంచి మారుమూల గ్రామాల్లో రోడ్లు, రవాణా సౌకర్యాలకు నోచుకోక గిరిజనులు నరకం చూస్తున్నారు. ప్రధాన గెడ్డలు, వాగులపై వంతెనలు లేకపోవడంతో వర్షాకాలంలో బాహ్య ప్రపంచంతో సంబంధం తెగిపోతున్నాయి. ఇలాంటి గ్రామాలు జిల్లాలో 400 వరకు ఉన్నాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. గత పాలకులు కూడా మారుమూల గ్రామాల్లో రోడ్లు, రవాణా సౌకర్యాలను పట్టించుకోలేదు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకులోయ, పాడేరు, రంపచోడవరం ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాగులాపల్లి ధనలక్ష్మి మారుమూల గ్రామాల్లో రోడ్లు, వంతెనల నిర్మాణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం ద్వారా ప్రధాన గెడ్డలు, వాగులపై వంతెన నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం సమగ్ర సర్వే జరిపించింది. వంతెనలు, కాజ్‌వేలు, కల్వర్టుల నిర్మాణానికి గిరిజన సంక్షేమశాఖ ఇంజనీరింగ్ అధికారులు ఐటీడీఏల ద్వారా ప్రభుత్వానికి సమగ్ర వివరాలతో నివేదిక అందించారు. ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో 21 వంతెనల నిర్మాణానికి పలు పథకాల ద్వారా రూ.22.40 కోట్లు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యాయి.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో..

జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలోని భారీ వంతెనలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నిర్మితమవుతున్నాయి.టెండర్లు పొందిన నిర్మాణ సంస్థలు ఆయా గెడ్డలపై నిర్మాణ పనులను ప్రారంభించాయి. జి.మాడుగుల మండలంలోని అత్యంత మారుమూల కిల్లంకోట పంచాయతీకి పోయే రోడ్డులో కోడుమామిడి గెడ్డ ఉంది.ఈగెడ్డలో నీటి ప్రవాహం నిత్యం అధికంగానే ఉంటుంది. వర్షకాలం మూడు నెలలు గెడ్డ ఉధృతితో గిరిజనులు రాకపోకలు సాగించేందుకు సాహసించరు. గెడ్డను దాటడం అత్యంత ప్రమాదకరం. గెడ్డ అవతల ఆంధ్రాతో పాటు, ఒడిశాకు చెందిన గ్రామాలు అనేకం ఉన్నాయి. ఒకప్పుడు మావోయిస్టులకు ఈ ప్రాంతం సేఫ్టీజోన్. వంతెన నిర్మాణం చేపట్టడంతో గిరిజనుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇదే పరిస్థితి పెదబయలు మండలం జామిగుడ పంచాయతీలో ఉంది. ఒడిశాకు సరిహద్దులో ఉన్న ఈ మారుమూల మావోయిస్టు ప్రభావిత జామిగుడ గిరిజనులకు ప్రభుత్వం న్యాయం చేసింది. గుంజివాడ గెడ్డపై వంతెన నిర్మాణ పనులను ప్రారంభించడంతో పరిసర గిరిజనులతో పాటు ఒడిశా ప్రజల్లో సంతోషం నెలకొంది.

మండలాల వారీగా వివరాలు

కొయ్యూరు: మండపల్లి రోడ్డులో గెడ్డ రూ.కోటి, ఎర్రగొండ రోడ్డులో రూ.2.35 కోట్లు, ఈదులబంద రోడ్డులో రూ.1.3 కోట్లు.
జి.మాడుగుల: కొడిమామిడిగెడ్డపై నిర్మాణానికి రూ.2.2 కోట్లు
పాడేరు: గుత్తులపుట్టులో కల్వర్టు నిర్మాణానికి రూ.30 లక్షలు
ముంచంగిపుట్టు: ఏనుగురాయి రోడ్డులో రూ.80 లక్షలు, గత్తురుమండ రోడ్డులో రూ.35 లక్షలు, బుంగాపుట్టు రోడ్డులో రూ.35 లక్షలు.
పెదబయలు: గుంజువాడ రోడ్డులో రూ.2 కోట్లు, గిన్నెలకోట రోడ్డులో రూ.1.4కోట్లు, పెదలోవ రోడ్డులో రూ.35 లక్షలు, పాతరూడకోట రోడ్డులో రూ.15లక్షలు.
హుకుంపేట: బిసాయిపుట్టు రోడ్డులో రూ.35 లక్షలు, ఆమూరు రోడ్డులో రూ.40 లక్షలు.
అనంతగిరి: జీలుగులపాడు రోడ్డులో రూ.2.20 కోట్లు, శరవన్నపాలెం రోడ్డులో రూ.2 కోట్లు.
డుంబ్రిగుడ: లోగిలిలో రూ.1.8 కోట్లు.
కూనవరం: టేకులొడ్డి రోడ్డులో రూ.50 లక్షలు.
వై.రామవరం: రవ్వగెడ్డ రోడ్డులో రూ.50 లక్షలు, పులిసురిమెట్టలో రూ. 50 లక్షలు, కోట రోడ్డులో రూ.50 లక్షలు

నాణ్యతగా నిర్మాణ పనులు



జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ప్రధాన గెడ్డలు, కొండ వాగులపై కల్వర్టులు, వంతెనల నిర్మాణాలను టెండరుదారులు ప్రారంభించారు. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో నాణ్యతగా నిర్మాణ పనులు జరిగేలా చర్యలు చేపట్టాం. అన్ని స్థాయిల్లోని ఇంజనీరింగ్ అధికారులు నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తారు. పెద్ద సంఖ్యలో వంతెనల నిర్మాణం జరుగుతుండడంతో గిరిజనులకు ఎంతో మేలు జరుగుతుంది

– శ్రీనివాస్, ముఖ్య ఇంజినీరు, గిరిజన సంక్షేమశాఖ

వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశం



గిరిజనుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్

పాడేరు రూరల్ : స్పందన వినతుల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా తాగునీటి సదుపాయం, రహదారుల నిర్మాణాలు, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఘాట్ మార్గంలో రక్షణ గోడలు నిర్మించాలని వినతులు అందాయి. అనంతరం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. స్పందన వినతుల పరిష్కారానికి ప్రత్యేకంగా విచారణాధికారిని నియమించాలని సూచించారు. అధికారులు ముందుగా అర్జీలు తమ శాఖకు సంబంధించిందా కాదా అనేది ముందుగా పరిశీలించాలన్నారు. కాకుంటే సంబంధిత శాఖకు అందజేయాలన్నారు. స్వీకరించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయి తనిఖీ చేపట్టి వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రధానమంత్రి ఆది ఆదర్శ యోజన పథకంలో గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పీవీటీజీల జీవితాల్లో గణనీయమైన మార్పులు రావాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న రీసర్వేపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. అటవీ హక్కుల పత్రాలు పొందిన లబ్ధిదారుల వివరాలను గిరిభూమి పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. జేసీ శివ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ అభిషేక్ పాల్గొన్నారు.

ఈనాడు.. అసత్య కథనాలు మానుకో

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- నిరసనగా ఆ పత్రిక ప్రతులు దహనం



ఈనాడు ప్రతులను తగులబెడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పార్టీ శ్రేణులు

అరకులోయ రూరల్: కట్టుకథలతో ఈనాడు పత్రికలో రామోజీరావు ప్రచురిస్తున్న అసత్య రాతలు మానుకోవాలని ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సూచించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నేతలతో కలిసి ఈనాడు ప్రతులను తగులబెట్టి రామోజీరావు, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పట్టాభిని కొట్టారంటూ ప్రచురించిన కథకాల్లో ఫొటోలను మార్ఫింగ్ చేయడాన్ని అందరూ గమనించారన్నారు. వైఎస్సార్‌సీపీకి అన్ని వర్గాల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకనే కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. జర్నలిజం వ్యవస్థను రామోజీరావు, చంద్రబాబు భ్రష్ట పట్టిస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వారిలో మార్పు రాలేదన్నారు. రాజకీయంగా ప్రభుత్వాన్ని చేసేదేమీ లేకపోవడంతో తప్పుడు రాతలతో దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్, మండల కన్వీనర్ పట్టాసి సంపత్‌కుమార్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి హస్తినాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నామినేషన్ల తిరస్కరణ



నామినేషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, ఎన్నికల పరిశీలకుడు సిద్దార్థ్ జైన్, డీఆర్వో

- స్క్రూట్నీ పూర్తి చేసిన రిటర్నింగ్ అధికారి మల్లికార్జున
- 40 మంది అభ్యర్థులు
- 27 వరకూ ఉపసంహరణకు గడువు

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్క్రూట్నీ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున, ఎన్నికల పరిశీలకులు సిద్దార్ద్ జైన్ సమక్షంలో శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 16వ తేదీ నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి 23వ తేదీ వరకూ మొత్తం 44 మంది అభ్యర్థులు 70 సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు, ఆయా అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో మొత్తం 70 సెట్లు నామినేషన్లను కలెక్టర్ స్క్రూట్నీ చేశారు. విశాఖ జిల్లాకు చెందిన ఇమామ్ మోహియుద్దీన్ అహ్మద్, రుద్రరాజు కల్యాణ వర్మ నామినేషన్లను తిరస్కరించారు. విజయనగరం జిల్లాకు చెందిన బొలిశెట్టి వెంకటేశ్వర రావు, అనకాపల్లి జిల్లాకు చెందిన కొలుపురి నాగ భారతి నామినేషన్లను తిరస్కరించారు. మొత్తం 44 నామినేషన్లకు సంబంధించి నాలుగు నామినేషన్లు తిరస్కరించినట్లు కలెక్టర్ డా. మల్లికార్జున వెల్లడించారు. ఈనెల 27 వరకు నామినేషన్లు ఉపసంహరణకు గడువు ఉందని తెలిపారు. పరిశీలనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ శ్రీనివాస్ మూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

గృహ సారథులే అభివృద్ధికి వారధులు



ఈనాడు ప్రతులను తగులబెడుతున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, పార్టీ శ్రేణులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

చింతపల్లి: గృహ సారథులే గ్రామాల అభివృద్ధికి వారధులని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పెదబరడ పంచాయతీ లోతుగెడ్డ జంక్షన్‌లో శుక్రవారం గృహసారథులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడంలో గ్రామ వలంటీర్లు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలని టీడీపీ కుట్రలు పన్నుతోందన్నారు. చంద్రబాబు ఎన్ని నాటకాలు వేసినా ప్రజలు నమ్మరని ఆమె అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రి చేసేందుకు దోహద పడతాయన్నారు. పాడేరు నియోజకవర్గంలో గతంలో కంటే ఎక్కువ మెజారిటీ సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జగనన్న పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు, ఎంపీపీ కోరాబు అనూషాదేవి, జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, కార్యదర్శి పాంగి గణబాబు, చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల పార్టీ అధ్యక్షులు మోరి రవి, బొబ్బిలి లక్ష్మణ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత, సర్పంచ్‌లు గోపాల్, లలిత, వంతల మహేశ్వరి, పండన్న ఎంపీటీసీలు పద్మ,జయలక్ష్మి, మీనాకుమారి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ నాజర్‌వలీ పాల్గొన్నారు.

సంక్షేమ రథసారథులు మీరే

రాజవొమ్మంగి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రతి సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లు, ప్రతి 50 కుటుంబాలకు ఇరువురు గృహ సారథులను నియమించారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో మండలంలోని దూసరపాము, అమీనాబాద్ గ్రామాల్లో 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ అధ్యక్షతన ఈ కార్యక్రమాల్లో ఆమె మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా నిలిచేలా గ్రామసచివాలయ వ్యవస్థను సీఎం రూపొందించారన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా పర్యవేక్షణతోపాటు వారి సమస్యలను గృహసారథులు గుర్తించి ప్రజాప్రతినిధులకు నివేదిస్తే పరిష్కారానికి కృషి జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో టీడీపీ నేతల కుట్ర రాజకీయాలను భగ్నం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో స్వచ్ఛభారత్ పేరిట మంజూరు చేసిన మరుగుదొడ్ల సొమ్ములను బొక్కేశారన్నారు. సంక్షేమ పథకాలను జన్మభూమి కమిటీల పేరుతో కావాల్సినవారికి కట్టబెట్టేవారన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేకపోయారన్నారు. సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు జగనన్న ఇచ్చిన హామీల్లో 95 శాతం నెరవేర్చారన్నారు. అనంతరం సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులకు దిశానిర్దేశం చేశారు. 'మా నమ్మకం నువ్వే జగనన్న' కిట్లను అందజేశారు. దూసరపాములో సర్పంచ్ చీడి శివ, అమీనాబాద్‌లో కించు వెంకటలక్ష్మి కార్యక్రమాలను పర్యవేక్షించారు. సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్‌గా జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణను నియమించినట్లు ఎమ్మెల్యే ధనలక్ష్మి ప్రకటించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్‌ఎంపీపీ చప్పా చంద్రరాణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు పాల్గొన్నారు.



గృహసారథులకు దిశ నిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

ఈనాడు ప్రతులు దహనం

తప్పుడు కథనాలను ప్రచురితం చేస్తున్న ఈనాడు పత్రిక ప్రతులను పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీ నేతలు, ఎల్లోమీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.తమ ప్రభుత్వానికి ఉన్న ఆదరణను చూసి ఓర్వలేనితనంతోనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా చేతులు కలిపి కావాలనే తప్పుడు ప్రచారానికి కుట్రలకు పూనుకుంటున్నాయని విమర్శించారు.

గిరి సంక్షేమమే లక్ష్యంగా సేవలు

- యువతకు ఉచిత శిక్షణ
- ఉపాధి కల్పనకు ప్రణాళికాపరంగా చర్యలు
- ఎస్పీ సతీష్‌కుమార్
- బ్యారెక్స్ భవనాలు ప్రారంభం



భవనాల ప్రారంభంలో ఎస్పీ సతీష్‌కుమార్, చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్‌శివకిషోర్



మహిళా పోలీసులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గూడెంకొత్తవీధి: మావోయిస్టు ప్రాబల్య ప్రాంతంగా ముద్రపడిన జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షిస్తూనే ప్రభుత్వానికి గిరిజనులకు మధ్య వారధిగా సంక్షేమ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్టు ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీసు మైదానంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన బ్యారెక్స్ భవనాలను చింతపల్లి ఏఎస్పీ ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మైదాన ప్రాంతాలతో పోల్చి చూస్తే మన్యంలో పోలీసుల విధులు ఎంతో కష్టతరంగా ఉంటాయన్నారు. ఇటువంటి భిన్నమైన పరిస్థితులు, వాతావరణం మధ్య అమాయక ఆదివాసీ గిరిజనులకు తమవంతు సాయంగా ఉండాలని భావించి పోలీసు యంత్రాంగం అనేక సామాజిక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే నిరుద్యోగ యువతీ యువకులకు ప్రేరణ పేరుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని చెప్పారు. సీఆర్‌పీఎఫ్, పోలీసు ఉద్యోగాలకు సంబంధించి ఉచితంగా అవసరమైన శిక్షణ ఇస్తున్నామన్నారు. సేతు కార్యక్రమం పేరిట దివ్యాంగులకు సదరం శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. సదరం ధృవపత్రాలు పొందిన కొందరికి యాభై శాతం రాయితీపై ఆర్టీసీ బస్సు పాసులను తాము చొరవ తీసుకుని మంజూరు చేయించామన్నారు. మారుమూల గ్రామాలకు రహదారుల నిర్మాణానికి తమవంతు సహాయం చేస్తున్నామన్నారు. మారుమూల గ్రామాలకు సెల్ టవర్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోందన్నారు. గంజాయిని దూరం చేసి ప్రత్యామ్నాయ పంటల ద్వారా గిరిజనులకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నామని చెప్పారు. చదువు మానేసిన గిరి యువత అసాంఘిక కార్యక్రమాల వైపు ఆకర్షితులు కాకుండా స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పించుకోవాలన్నారు. ఇందుకు పూర్తిగా సహకరిస్తామన్నారు. గ్రామ సచివాలయ పోలీసులు క్షేత్రస్థాయిలో అన్ని విధాలా సహకరిస్తున్నారన్నారు. ఉత్తమ సేవలందించిన గూడెం కొత్తవీధి ఎస్ఐ అప్పలసూరి, సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్ బీరేంద్రకుమార్, పలువురు సీఆర్‌పీఎఫ్ , ఏపీఎస్‌పీ సిబ్బందితోపాటు మహిళా పోలీసులకు ప్రశంసాపత్రాలను అందించారు. సదరం శిబిరానికి హాజరైన పలువురి దివ్యాంగులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. జీకేవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ అప్పలసూరి, సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్ బీరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీసీసీ పెట్రోల్ బంక్‌లో తనిఖీలు



బంకులో తనిఖీలు నిర్వహిస్తున్న తహసీల్దారు రాజ్‌కుమార్

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలోని జీసీసీ పెట్రోల్ బంక్‌ను శుక్రవారం ఇన్‌చార్జి తహసీల్దార్ రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. పాడేరు సబ్‌కలెక్టర్ అభిషేక్ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు. జీసీసీ ఉద్యోగులు బాలరాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దట్టంగా పొగమంచు

సాక్షి,పాడేరు: మన్యంలో పొగమంచు దట్టంగా కురుస్తోంది. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మంచుతెరలు వీడలేదు. పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 13 డిగ్రీలు, చింతపల్లిలో 13 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 15.1డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 11గంటల నుంచి ఎండ తీవ్రత నెలకొంది. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ చుర్రుమంది. ఎండ తీవ్రతకు పాడేరు, అరకు వారపుసంతల్లో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం ఐదుగంటల చల్లదనం నెలకొంది. రాత్రి వేళల్లో చలిగాలులు విజృంభిస్తున్నాయి.

రాజవొమ్మంగి: మండల కేంద్రం రాజవొమ్మంగి పరిసరాల్లో శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు మంచు దట్టంగా కురుస్తూనే ఉంది. అయితే మామిడి, జీడిమామిడి పూతకు నష్టం జరిగే అవకాశం ఉన్నందున రైతులు ఆందోళన చెందుతున్నారు.

గిరి యువతి ఆత్మహత్య



యువతి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

గూడెంకొత్తవీధి: మండలంలోని పెదవలస పంచాయతీ రంపుల గ్రామంలో సత్యశ్రీ (25)అనే గిరిజన యువతి గురువారం తన ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొయ్యూరు మండలం చుట్టుబంద గ్రామానికి చెందిన దుచ్చరి సాగర్ అనే యువకుడు తనను మూడేళ్లుగా ప్రేమించి, ఇప్పుడు వేరొకరిని వివాహం చేసుకుంటున్నాడని తెలిసి మనస్తాపంతో యువతి ఆత్మహత్యకు పాల్పడినట్టు సంఘటన స్థలంలో లభించిన లేఖ ద్వారా తెలిసిందని స్థానిక పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వారు చెప్పారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం యువతి మృతదేహాన్ని పరిశీలించి, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కుమారి, పెదవలస సర్పంచి వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

వన దేవత వేడుకకు సర్వం సిద్ధం

- ఈ నెల 27న మన్యం కొండ జాతర
- వేలాదిగా తరలిరానున్న భక్తులు

మోతుగూడెం: చింతూరు మండలం పొల్లూరులో నిర్వహించనున్న మన్యం కొండ జాతరకు చకచక ఏర్పాట్లు పూర్తవుతున్నాయి. ఒడిశా గిరిజనులు నిర్వహించే మన్యం కొండ జాతర వేడుకలకు ఏర్పాట్లు ఒడిశా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ప్రతి రెండేళ్లకు జరిగే మన్యం కొండ జాతరను ఈ ఏడాదిలో ఈనెల 27వ తేదీన నిర్వహిస్తారు.

నెల రోజుల ముందు నుంచే ...

పొల్లూరులో నిర్వహించే మన్యం కొండ జాతరకు ముందు నెలరోజులు పాటు ఒడిశాలో ఉత్సవాలు నిర్వహిస్తారు. ఒక్క రోజు మాత్రం పొల్లూరులో నిర్వహించే వేడుకకు లక్షలాది గిరిజనులు హాజరవుతారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా మన్యంకొండ గ్రామంలో ఉన్న గిరిజన వనదేవతలు కన్నమరాజు(శ్రీకృష్ణుడు) బాలరాజు(అర్జునుడు) పోతురాజు (బీముడు) ముత్యాలమ్మ తల్లి ఘటం ధ్వజం రూపంలో పూజలు చేశారు. వీటిని ప్రతి రెండేళ్లకు ఒకసారి ప్రాణప్రతిష్ఠ చేస్తారు. అయితే ఈ కార్యక్రమాన్ని పొల్లూరు జలపాతం వద్ద నిర్వహించడం ఒడిశా గిరిజనుల ఆచారం.



సీలేరులోని నదిపై ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ ర్యాంప్

ఈ నెల 27న ప్రధానమైన మంగళస్నానం, ప్రాణ ప్రతిష్ఠ నిర్వహిస్తారు. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి రూపం లేకుండా ఉన్న ముత్యాలమ్మతల్లి ఘటం ధ్వజ రూపంలో ఉన్న సోదరులు (కన్నమరాజు,బాలరాజు,పోతురాజు)తో కలిసి మన్యం కొండ చేరుకుంటారు.సరసనపల్లి గ్రామం నుంచి గద్వాల కోసం కొత్త వెదుర్లను తీసుకుని పూజారులు వస్తారు. కొండ గృహాల్లో ఉన్న మూల రూపాలకు ప్రత్యేక పూజలు చేసి బోయ యాత్ర నిర్వహిస్తారు. భక్తులు చెప్పులు లేకుండా వన దేవతలతో యాత్రను ఒడిశాలోని సీలేరు నది అవతల (పొల్లూరు గ్రామానిక ఎదురు ఒడ్డు)కు 26న చేరుకుంటారు. ఈ నెల 27 ఉదయం పూజ కార్యక్రమాలు ముగించిన తరువాత కొత్తగా తయారు చేసిన ప్రత్యేక పడవలపై వనదేవతలను నది దాటించి ఆంధ్రాలోని పొల్లూరు జలపాతం వద్దకు చేరుకుంటారు. వనదేవతలకు మంగళస్నానం చేయించి ప్రాణప్రతిష్ఠ చేస్తారు. భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. భారీ అన్నసమారాధన జరుగుతుంది. వన దేవతలకు జలపాతం దగ్గరలో ఉన్న గృహలో ప్రత్యేక పూజలు చేస్తారు. పూజలకు సంతృప్తి చెందిన ముత్యాలమ్మ జలపాతంలో బంగారు చేప రూపంలో దర్శనమిస్తుందని నమ్మకం.



సీలేరు నదిలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల గస్తీ

పక్కా ఏర్పాట్లు

ఒడిశా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే ఈ జాతరకు పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా వన దేవతలను, భక్తులను ప్రత్యేక బోట్లు, గస్తీ నడుమ సీలేరు నది అవతల ఒడ్డుకు చేర్చేందుకు ఒడిశా ఎన్‌డీఆర్‌ఎఫ్ ఏర్పాట్లు చేపట్టింది. పొల్లూరు జలపాతం వద్ద రెవెన్యూ అగ్నిమాపక, పోలీస్, అటవీ శాఖ, పంచాయతీ అధికారులు వేడుకలను పర్యవేక్షిస్తారు.



జాతరలో భక్తజనం(ఫైల్)

జాతర ఏర్పాట్ల పరిశీలన

మోతుగూడెం: మన్యం కొండ జాతరకు వచ్చి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశించారు. మన్యం కొండ(బడాయాత్ర) జాతర ఏర్పాట్లు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, బృందం శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీలేరు నది దాటి అక్కడ మోటు సబ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ , పంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, మన్యం కొండ జాతర కమిటీ అధ్యక్షులు భగవాన్ మహంతిని కలిసి ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు. సీలేరు నది దాటడానికి ఒడిశా ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక ఫ్లోటింగ్ జెట్టి బ్రిడ్జిని పరిశీలించారు. పొల్లూరు జలపాతాన్ని సందర్శించి అక్కడ పనులను పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భక్తుల భద్రతకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, 400 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా జాతర కమిటీ సభ్యులు పొల్లూరు శివాలయంలో ఎస్పీ సతీష్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఎస్పీ సతీష్‌కుమార్ వెంట ఏఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, మోతుగూడెం ఎస్ఐ వాసంశెట్టి సత్తిబాబు, ఏఎస్ఐ పట్టాభిరామయ్య, సిబ్బంది జాతర కమిటీ సభ్యులు మల్లికార్జున, వరప్రసాద్, వికాస్, శివరామకష్ణ తదితరులున్నారు.



మన్యం కొండ జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

హత్యాయత్నం చేసిన తాపీమేస్త్రికి రిమాండ్

కశింకోట: ప్రేయసి కోసం బస్సు డ్రైవర్‌ను బెదిరించి, హత్య చేయడానికి యత్నించిన తాపీమేస్త్రికి మేజిస్ట్రేట్ 14 రోజులపాటు రిమాండ్ విధించడంతో విశాఖ కేంద్ర కారాగారానికి తరలించి నట్టు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. అనకాపల్లి నుంచి తేగాడ వైపు వెళుతున్న ప్రైవేటు కళాశాల బస్సును ఈ నెల 22న బయ్యవరానికి చెందిన తాపీ మేస్త్రి గడసాల శివసాయి నిలిపి, తన ప్రేయసి కోసం డ్రైవర్ రొంగలి దేముళ్లను కత్తితో హత్య చేయడానికి యత్నించిన సంగతి తెలిసిందే. శివసాయిని అరెస్టు చేసి, అనకాపల్లి కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

పోస్టల్ సేవలు విస్తృతం



పోస్టల్ సేవలపై అవగాహన కల్పిస్తున్న విశాఖ రీజనల్ జనరల్ అధికారి రాములు

అరకులోయ రూరల్: పోస్టల్ శాఖ సేవలు మరింత విస్తృతం చేయాలని పోస్టల్ శాఖ విశాఖపట్నం రీజనల్ జనరల్ అధికారి రాములు అన్నారు. అరకులోయ, డుంబ్రిగుడ మండలాల పరిధిలోని చొంపి, కొర్రాయి, కోల్లపూట్టు పంచాయతీల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అరకులోయ పోస్టల్ కార్యాలయం ఆవరణలో పోస్టల్ శాఖ సిబ్బందితో సమవేశమయ్యా. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేయాలన్నారు. పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వినియోగదారులు ఎక్కువ మంది పొదుపు ఖాతాలు తెరిచేలా కృషి చేయాలన్నారు. అరకు సబ్ డివిజన్ పోస్టల్ శాఖ ఐపీవో బి.ఉపేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల నిఘా

సాక్షి,పాడేరు: మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై పోలీసుశాఖ తనిఖీలను ప్రారంభించింది. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు తమ పోలీసు స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు.సాయంత్రం నాలుగు గంటల నుంచి ప్రధాన జంక్షన్‌ల వద్ద పోలీసు బృందాలు వాహన చోదకులకు బ్రీత్ ఎన్‌లైజర్ పరీక్షలు జరుపుతున్నారు.ప్రమాదాలు నివారణ లక్ష్యంగా పోలీసుశాఖ పనిచేస్తుంది.

మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా జరిగే అనర్ధాలను వాహనచోదకులకు పోలీసులు వివరిస్తున్నారు.పాడేరు పట్టణంలోని అన్ని రోడ్లతో పాటు కాన్వెంట్,చింతలవీధి జంక్షన్‌ల వద్ద రోజువారి తనిఖీలను ప్రారంభించారు.రాత్రి సమయంలోను తమ పోలీసు బృందాలు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నాయని పాడేరు సీఐ సుధాకర్ తెలిపారు.పర్యాటక ప్రాంతాలైన అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల్లోని ప్రధాన జంక్షన్‌లు, మండల కేంద్రాల్లో వాహనాల తనిఖీలను మమ్మురం చేశామని, ఇటీవల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ఈమూడు స్టేషన్ల పోలీసు బృందాలను మరింత అప్రమత్తం చేసినట్టు అరకులోయ సీఐ జి.దేముడుబాబు 'సాక్షి'కి తెలిపారు.



చింతలవీధి జంక్షన్‌లో వాహన చోదకులకు బ్రీత్ ఎన్‌లైజర్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

సామాజిక న్యాయం జగనన్నతోనే సాధ్యం

- ప్రభుత్వంపై రామోజీరావు, చంద్రబాబు అసత్య ప్రచారాలు
- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి

రాజవొమ్మంగి: రాష్ట్రంలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన 14 మందిని ఎమ్మెల్సీకి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిఫార్సు చేయడం హర్షణీయమన్నారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యే శుక్రవారం పర్యటించారు. విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి జగన్‌కు వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేక రామోజీరావు, చంద్రబాబు కుట్ర రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈనాడులో తప్పుడు రాతలు రాస్తూ అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రజలు నేడు ఈనాడు పేపరును నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో కూడా టీడీపీకు తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ చంద్రరాణి, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజ్, అడ్డతీగల జెడ్పీటీసీ సభ్యుడు వీర్రాజు, సర్పంచ్ శివ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

పాయకరావుపేట: మండలంలోని నామవరం సమీపంలో రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఈ వ్యక్తి రైల్వే ట్రాక్ దాటుతుండగా విశాఖపట్నం నుంచి తుని వైపు వెళ్తున్న రైలు ఢీకొన్నట్టు చెప్పారు. మృతుడి వద్ద ఏ విధమైన వివరాలు లేవని, సుమారు 45 సంవత్సరాలు వయస్సు ఉంటుందని, గోల్డ్ కలర్ షర్ట్, బ్లూ కలర్ గడుల లుంగీ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ అబ్దుల్ మారూఫ్ తెలిపారు.



రైలు పట్టాలపై మృతదేహం

గంజాయి సాగు, రవాణా మానుకోవాలి

ఎస్ఐ మనోజ్‌కుమార్



పోలీసు స్టేషన్‌లో పాత ముద్దాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మనోజ్‌కుమార్

పెదబయలు: గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ చెప్పారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు గంజాయి తదితర కేసుల్లో పాత ముద్దాయిలకు కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించారు.మండలంలోని 23 గ్రామ పంచాయతీల నుంచి గంజాయి కేసుల్లో 350 మంది పాత ముద్దాయిలను పిలిపించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. గంజాయి కేసుల్లో ఇరుక్కోవడంతో బాధిత కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయని, పిల్లల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోందన్నారు. పాత ముద్దాయిలపై బైండోవర్ కేసులున్నాయన్నారు.గంజాయి ముద్దాయిలుగా ఉన్న వారు మరలా గంజాయి సాగు, రవాణాకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని ఎస్ఐ మనోజ్ కుమార్ చెప్పారు. గ్రామాల్లో పరివర్తన కార్యక్రమం నిర్వహించి, గంజాయి, సారా అనర్థాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరిలో పరివర్తన వచ్చి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యానవన పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

సైకిల్‌పై షిర్డీ యాత్ర



సైకిల్‌పై షిర్డీకి బయలుదేరుతున్న భక్తులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలం నుంచి ఆరుగురు భక్తులు షిర్డీకి సైకిల్‌పై పయనమయ్యారు. లోక కళ్యాణార్థం, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు భక్తుడు పూడి నాగు తెలిపారు. గతంలో ఆరు సార్లు షిర్డీకి వెళ్లినట్లు చెప్పారు. సైకిల్ యాత్రను ప్రారంభించిన వారిలో మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు శరగడం జగ్గారావు, తనకాల లక్ష్మి, పోలారపు జగ్గారావు, పూడి నానాజీ, పూడి గోవింద, ఏ బుజ్జి, బత్తిన నాగార్జున తదితరులున్నారు.

మెరుగైన వైద్యం అందించండి

- అవసరమైన వసతులు కల్పిస్తాం
- రిఫర్ లేకుండా స్థానికంగా సేవలు
- కలెక్టర్ సుమిత్‌కుమార్
- చింతూరు సీహెచ్‌సీలో సమీక్ష
- అన్ని విభాగాల తనిఖీ
- సౌకర్యాలకు రూ.15 లక్షల మంజూరు

చింతూరు: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. చింతూరు ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వైద్యాధికారులతో సమీక్షించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన పూర్తిస్థాయిలో సౌకర్యాలను 50 రోజుల్లో కల్పిస్తామన్నారు. అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులకు మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనిపై క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. గైనిక్ సేవలకు అవసరమైన పరికరాలు సమకూరుస్తామన్నారు. ఆర్థోపెడిక్ సేవలకు సంబంధించి ఎక్స్‌రే ప్లాంట్‌కు మరమ్మతులు, ఫ్రాక్చర్ టేబుల్, సిఆర్మ్ సిస్టమ్ కోసం రూ.15 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈఎన్‌టీ వైద్యులకు అవసరమైన పోర్టబుల్ ఎండోస్కోపును వెంటనే కొనుగోలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్యను ఆదేశించారు. అత్యాధునిక పడకలు, చిన్న పిల్లల మందులు కొనుగోలు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవలని సూచించారు. గ్రామ స్థాయిలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. రోగులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

రోగులను భద్రాచలం తరలించకుండా స్థానికంగా మెరుగైన వైద్యసేవలు అందించేలా సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. అవసరమైన వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని, సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గైనిక్ డాక్టర్ శశికళ, వైద్య నిపుణులు పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్